క్లుప్తంగా

చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యం అవసరం



చౌడువాడ శాఖా గ్రంథాలయం వద్ద ఖోఖో పోటీలు

కె.కోటపాడు : విద్యార్థులు చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులు ఖోఖో పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

సన్యాసమ్మ అమ్మవారి ఒడ్డు పండగ రేపు



సన్యాసమ్మ అమ్మవారు

దేవరాపల్లి : దేవరాపల్లిలోని చిన్నం నాయుడు నగర్‌లో సన్యాసమ్మ అమ్మవారి ఒడ్డు పండగ మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరరావు, గౌరీ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మహిళల కోలాట ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

ముత్యమాంబను దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం




ముత్యమాంబను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : కాశీపురం గ్రామంలో ఆదివారం ఘనంగా ముత్యమాంబ అమ్మవారి ఒడ్డు పండగ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబూరావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు దేముడు నాయుడు, దాసరి గోపి, చలుమూరి చంద్ర మోహన్, దాసరి మోహన్ నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు మాడుగులకు సత్యసాయి ప్రేమ రథం

మాడుగుల: ఈ నెల 26 వ తేదీన ఉదయం 10 గంటలకు మాడుగుల గ్రామానికి భగవాన్ సత్యసాయి ప్రేమ రథం రానుందని, సత్యసేవ సమితి కన్వీనర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. సత్య సాయి భక్తులు ఊరేగింపులో పాల్గొనాలని శ్రీనివాసరావు కోరారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మ అమ్మవారి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం : మోదమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలో కొత్తకోట గ్రామంలో గల మోదమాంబ అమ్మవారి పండగను సేనాపతి వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు భక్తులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. తెల్లవారు నుంచే అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమ, చీరలు, సారె పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సాగునీటి కాలువలపై నిర్లక్ష్యం

- పూడికతో అందని సాగునీరు
- ఆక్రమణలతో తగ్గుతున్న విస్తీర్ణం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో రైతులు



జీకోడూరులో చెత్తతో దర్శనమిస్తున్న సాగునీటి కాలువ



మాకవరపాలెంలో తుప్పలతో నిండి ఉన్న మెరక కాలువ

మాకవరపాలెం: సాగునీటి కాలువలపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వీటిని పట్టించుకోకపోవడంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదు. అంతేగాక ముప్పై అడుగులకుపైగా ఉండాల్సిన కాలువలు ఆక్రమణలతో కుచించుకు పోతున్నా మిన్నకుంటున్నారు. ఫలితంగా పుష్కలంగా నీరున్నా ఏటా చివరి ఆయకట్టు భూములకు నీరందక రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నాటికైనా వీటిని బాగుచేస్తారో లేదోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం మండలాల్లో సుమారు 35 **వేల ఎకరాల వరకు పంట భూము**లున్నాయి. **వీటిని 25 వేల మందికిపైగా రైతులు** సాగుచేస్తున్నారు. **ఈ భూములకు సాగునీరు అ**ందించేందుకు **అవసరమైన నీటి వనరులూ ఉన్నా**యి. కానీ అవి సక్రమంగా లేకపోవడంతో రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడంలేదు. అయినా వీరి బాధలను ఇరిగేషన్ అధికారులు గుర్తించడం లేదు.

ఆక్రమణలతో తగ్గుతున్న విస్తీర్ణం..

పంట భూములకు నీరందించే కాలువలు ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గిపోతున్నాయి. ఒక్కో కాలువ 25 నుంచి 35 అడుగుల మేర విస్తీర్ణంతో ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం పది అడుగులు కూడా ఉండడం లేదు.

సిమెంట్ లైనింగ్‌తో ఉన్న కాలువలు తప్ప మిగిలినవి ఆక్రమణల్లో చిక్కుకుంటున్నాయి. కానీ వీటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ఇదే తడవుగా కాలువల పక్కన ఉన్న కొందరు రైతులు ఆక్రమణలు చేసుకుంటూ పోతున్నారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లకు ఈ కాలువలు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. దీంతోపాటు జలాశయాల ద్వారా నీరు సరఫరా చేసే కాలువల లైనింగ్‌లు కూడా దెబ్బతిన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు.

పూడికతో అందని సాగునీరు..

కాలువల్లో పూడిక పెరిగిపోయి ఉండడంతో శివారున ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. ప్రస్తుతం ఉన్న సాగునీటి కాలువలు ఎక్కడ చూసినా పూడికతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కాలువల విస్తీర్ణం తక్కువగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే ప్రవహిస్తున్న నీటితో పూడిక పేరుకుపోతోంది. ఉపాధి పథకంలో కొన్ని కాలువల్లో పూడిక తొలగించినా ఫలితం ఉండడం లేదు. కొన్ని గ్రామాల్లో అయితే పూడిక తొలగించక ఖరీఫ్‌లో రైతులు సాగు నీరందక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు ఈ ఖరీఫ్‌కైనా వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

చెత్తతో కాలువ కనుమరుగు



గ్రామంలో ఉన్న చెత్తను కాలువలో వేసేయడంతో కాలువలు కనుమరుగవుతున్నాయి. మా గ్రామంలో ఉన్న కోదండరాయ చెరువుకు కొండ గెడ్డల నుంచి నీరు వెళ్లే కాలువ చెత్త, తుప్పలతో దర్శనమిస్తోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మళ్ల జగన్నాథరావు, జి.కోడూరు

రోలుగుంటలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు భవానీ

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్ వద్ద ఆదివారం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 112 మందికి ఉచితంగా వైద్య నిపుణురాలు దుర్గా భవానీ, సురేష్ కంటి పరీక్షలు చేసి వీరిలో 59 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి అవసరమైన మందులను ఫార్మసిస్ట్ లావణ్య, అరుణ కుమార్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సకు ఎంపిక చేసిన వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రికి వాహనంపై తరలించినట్టు క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

జనసేనలో చేరలేదు

సర్పంచ్ రాంబాయిరాంబాబు

మాడుగుల : మండలంలో కింతలి వల్లాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి చేరినట్టు సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఆదివారం గ్రామంలో యువకులు జనసేనలోకి కొంతమంది చేరడం వాస్తమేనని, కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లేరని ఖండించారు. గ్రామంలో కొందరు జనసేనలోకి చేరితే వైఎస్సార్ సీపీ నుంచి చేరారని ప్రచారం చేసుకోవడం తగదని అన్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల ఒడ్డు పండగలు



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం మోదమాంబ అమ్మవారు



ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో గ్రామ దేవతలు ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కె.జె.పురం, సాగరం, ఎం.కోడూరు, ఘాట్ రోడ్డు, తదితర గ్రామాల్లో మోదమాంబకు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎం.కోడూరు, కె.జె.పురం, మోదమాంబ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఎం.కోడూరులో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి సంజీవిరావు సారథ్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




రావికమతం హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రావికమతం : రావికమతం హైస్కూల్లో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత అంతా ఒక్క చోటికి చేరారు. వారంతా కొందరు ఉద్యోగులుగా, గృహిణులుగా, ఉన్నత చదువులు, ఇలా పలు రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం ఉదయాన్నే హైస్కూల్లో సమావేశమై తాము చదువుకున్న రోజులు, నాటి చిలిపి పనులు, ఆడుకున్న ఆటలు నెమరువేసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. మధ్యాహ్నం అంతా సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. 20 ఏళ్ల తరువాత అందరినీ ఒక్కచోట చేర్చాలని జెర్రిపోతుల గంగరాజు, జాజిమొగ్గల శ్రీను, ప్రగడ శ్రీను, నక్కా ఉమామహేశ్వరి బాధ్యత తీసుకొని స్నేహితులు అందరినీ కలుసుకొని ఈ కార్యక్రమం జరిగేలా కృషి చేశారు. ఇలా ప్రతి సంవత్సరం కలుసుకోవాలని తీర్మానం చేసుకున్నారు.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం



నిండుకుండలా పెద్దేరు జలాశయం

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కారు మబ్బులు కమ్మేయడంతో ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం కూల్‌కూల్‌గా మారింది. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు. కాగా భారీ వర్షం ధాటికి ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. లోతట్టు పంట పొలాల్లో సైతం వర్షపు నీరు చేరింది. వెరసి వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో భారీ వర్షం.. పెద్దేరులో పెరిగిన నీటిమట్టం

మాడుగుల : మండలంలో ఆదివారం సాయంకాలం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 26 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదయింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 135 మీటర్లకు చేరుకుంది. పెద్దేరు ఆయకట్టు 15 వేల ఎకరాలకు సాగునీటికి ఢోకాలేదని, జలాశయం జేఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

వడ్డాదిలో ముగిసిన వేసవి శిబిరం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బుచ్చియ్యపేట : అమ్మహెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలోవడ్డాది శ్రీ కేవీడీ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. 15 రోజుల పాటు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులకు తైక్వాండో, యోగ, ఇతర క్రీడలపై శిక్షణ అందించారు. విద్యార్థులకు గుడ్ టచ్,బాడ్ టచ్‌లపై కోచ్ లక్ష్మి అవగాహన కల్పించారు.15 రోజులు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందచేశారు. క్రీడలతో మానసిక వికాసం, ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పలువురు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గండం వెంకటేష్, పీటర్ రాంబాబు, లక్ష్మి, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, గ్రౌండ్ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో సామూహిక పెండ్లిరాట



ఏఎల్‌పురంలో పెండ్లిరాట వేస్తున్న గ్రామస్తులు

గొలుగొండ : సామూహిక వివాహ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏఎల్‌పురం గ్రామంలో ఉన్న పద్మావతి కళ్యాణ మండపంలో వివాహ కార్యక్రమంలో పెండ్లి రాట వేయడం జరిగింది. ఈనెల 30 తేదీన దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు ,వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీల సామూహిక వివాహ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని సంస్థ ప్రతినిధి సూర్య తెలిపారు. ఈనెల 30న ఉదయం పది గంటలకు సుమారుగా 108 ఆదివాసీల జంటలకు వివాహ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంనిర్వహించడం జరుగుతుందని సంస్థ సభ్యులు తెలిపారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. 50 ఏళ్లు పైబడిన సుమారు 40 మంది క్లబ్ సభ్యులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. వేసవికాలంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని, ఇటువంటి సందర్భంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం విశేషం అన్నారు. ప్లాస్టిక్ నిషేధం కోసం క్లబ్ వారు కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు వాడకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు అడిగర్ల వరహాలనాయుడు, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎం.వి.రంగారావు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షంతో రైతులకు ఊరట

మాడుగుల రూరల్ : మండలంలో పలు చోట్ల ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ సాగు పనులకు ఉపయోగకరంగా ఉంటుదని రైతులు పేర్కొన్నారు. ప్రధానంగా ఖరీఫ్ వరి నారు మడులు సిద్ధం చేస్తున్న రైతులుకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉందని రైతులు పేర్కొన్నారు.

ఇది రోడ్డా...మురుగు కాలువా..?

- ఒమ్మలి చెరకు తూనిక కేంద్రం వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు
- 10 రోజులుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రయాణికులు, చిరు వ్యాపారుల ఆగ్రహం




ఒమ్మలి చెరకు కాటా జంక్షన్ వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ మురుగునీరు

మాడుగుల: మండలంలో ఒమ్మలి చెరకు తూనిక కేంద్రం వద్ద సుమారు 20 వ్యాపార దుకాణదారులు నివాసముంటున్నారు. రావికమతం, నర్సీపట్నం, పాడేరు, మాడుగుల మండలాలకు వెళ్లడానికి ప్రధాన కూడలి ఒమ్మలి చెరకు కాటా జంక్షన్. అయితే ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఘాట్ రోడ్ నుంచి కింతలి వరకు సుమారు రూ.9 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో అప్పట్లో జంక్షన్ వాసులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ జంక్షన్‌లో రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు పూడికపోవడంతో పాటు పంట పొలాలు నీరు చేరడంతో రోడ్డుపై ప్రవహించి వ్యాపార దుకాణాల్లోకి మురుగునీరు చేరిపోతుంది. ప్రయాణికులు కూడా ఈ రోడ్డుపై మురుగు నీరు చేరడంతో దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. గత 10 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. బైక్‌లు వర్షం పడినపుడు నీటిలో మునిగిపోవడంతో ఆగిపోతున్నారు. కాలినడకన వెళ్లేవారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట కప్పలు, పాములు ఇళ్లలోకి చొరబడుతున్నాయని కంటి మీద కునుకు లేకుండా పోతుందని, స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే జంక్షన్

మండలంలో సుమారు 40 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఈ రోడ్డే ఆధారం. అలాగే ప్రతి రోజు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రాత్రిపూట వాహనాలు డ్రైనేజీలో పడిపోయే ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని వాహన చోదకులు కోరుతున్నారు.


అధికారులు పట్టించుకోలేదు..



వారం రోజుల నుంచి డ్రైనేజీల్లోని మురుగునీరు పొంగిపోవడంతో ఇళ్లలోకి మురుగు నీరు వచ్చి చేరుతుంది. దీంతో కప్పలు, పాములు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఏ మాత్రం వర్షం కురిసినా సరే ఇళ్లలోకి మురుగునీరు చేరిపోతుంది. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీల్లో పూడిక తొలగించాలి

-గండేపల్లి అమ్మాజీ, ఒమ్మలి చెరకు తూనిక కేంద్ర జంక్షన్

వారం రోజులుగా మురుగునీటిలో ఉంటున్నాం..



వారం రోజుల నుంచి డ్రేనేజీల్లో ఉన్న మురుగు నీరు ఇళ్లలోకి చేరడం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నాం. పంట పొలాల్లో నీరు డ్రైనేజీల్లోకి చేరడంతో అది పూడిక పోవడంతో ఈ సమస్య ఏర్పడింది. రోజురోజుకు మురుగునీరు దుర్వాసన పెరిగి పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కాత రమణ, ఒమ్మలి చెరకు కాటా జంక్షన్

తురాయి పూల సోయగం



కొరువాడ జగన్నాథపురం మార్గంలో తురాయి పూల స్వాగతం

కె.కోటపాడు : మండలంలో కొరువాడ జగన్నాథపుపురం- ఆర్.వై.అగ్రహారం గ్రామాల మధ్య రోడ్లకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎరుపు రంగు పూలతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రెండు కిలోమీటర్ల పొడవు గల రోడ్డు మార్గంలో గల తురాయి చెట్లకు ఎరుపు రంగుతో పూలు వికసించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులను ఈ ప్రాంతం ఆకట్టుకుంటుంది. స్వాగతం పలికేలా తురాయి పూలు దర్శనమిస్తున్నాయి.